
సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం ⁞ 17 ⁞ ఆగస్టు ⁞ 2024



నేత్రపర్వం.. ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఏకాదశి ఉత్సవం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై శ్రీవారు ఊరేగారు.



ఏపీ నిట్ అన్నింటా ఫిట్

తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ ప్లేస్‌మెంట్లలో దూసుకుపోతోంది. మేటి సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకుంటోంది. నేడు ఆరో స్నాతకోత్సవానికి ముస్తాబయ్యింది. 8లో ▸



తమ్మిలేరు మరమ్మతులు ఆలస్యం

తమ్మిలేరు జలాశయం మరమ్మతులు ఆలస్యం కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడమే కారణం. 8లో ▸

న్యూస్‌రీల్

అదనపు ఎస్పీల బదిలీ

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురు అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం రాత్రి ఈ మేరకు ఆదేశాలిచ్చింది. ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావును సీఐడీకి బదిలీ చేసింది. జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణిని, ఉమ్మడి పశ్చిమగోదావరి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్‌ను పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

పేదల ఆకలి తీర్చేలా..



అల్పాహారం వడ్డిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: పేదల ఆకలి తీర్చేలా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం భీమవరం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)తో కలిసి ఆమె ప్రారంభించారు. జిల్లాలోని ఎనిమిది ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయగా వాటిలో మూడు భీమవరంలో ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి ప్రజలకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి రుచిచూశారు.

వ్యవసాయాభివృద్ధికి కృషి
జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలను అగ్రగామిగా ఉంచేందుకు పక్కా ప్రణాళికతో కృషి చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. జేసీగా శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన సర్వీస్ ప్రారంభంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పూర్వ పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో పనిచేశారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో సబ్ కలెక్టర్‌గా, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఎన్నికల అనంతరం శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ పీఓగా వెళ్లి ఇటీవల జరిగిన బదిలీల్లో పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ నియమితులయ్యారు. విధులు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేనివిధంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ–క్రాప్ నమోదులో వాస్తవ సాగుదారులను మాత్రమే నమోదు చేయాలని, కౌలు రైతుకు న్యాయం చేయాలనేదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపుతామని, రెవెన్యూ, భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించిన అభినందనలు తెలిపారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: వృద్ధుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డాల నాగ సూర్య సత్యనారాయణ, కొటికలపూడి చిట్టి వెంకయ్య కోరారు. శుక్రవారం ప్రపంచ వృద్ధుల కోర్కెల దినోత్సవం సందర్భంగా భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణ చటాన్ని పటిష్టంగా అమలు చేయాలని, జిల్లా, మండల కేంద్రాల్లో వృద్ధుల సంఘం కార్యాలయాలు, డేకేర్ సెంటర్, కమ్యూనిటీ హాల్స్ కోసం స్థలం కేటాయించాలని, రైలు ప్రయాణంలో వృద్ధులైన మహిళలకు 50 శాతం, పురుషులకు 40 శాతం రాయితీ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో బోనం పాండురంగారావు, కట్రెడ్డి సత్యనారాయణ, తాళ్లపూడి గాంధీ, పి.రామకృష్ణంరాజు, పి.లక్ష్మణ వర్మ, గ్రంధి రాజారావు, కడియం ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చినవెంకన్న పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం నుంచి స్వామివారి దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు అంకురార్పణ, 18న పవిత్రాధివాసం, 19న పవిత్రావరోహణ, 20న మహా పూర్ణాహుతి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహిస్తామని ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నామన్నారు.

అన్ననా్నా..
మరమ్మతుల్లో మెక్కేశారు

- అన్న క్యాంటీన్ పనుల్లో అవినీతి బాగోతం
- ఒక్కో క్యాంటీన్ మరమ్మతులకు రూ.7 లక్షల నుంచి రూ.16 లక్షలు
- జిల్లాలో 9 క్యాంటీన్లకు రూ.80 లక్షల వ్యయం
- అంచనాల్లో అధికారుల చేతివాటం.. కూటమి నేతలకు కాంట్రాక్టులు
- గత ప్రభుత్వంలో రూ.16 లక్షలతో కొత్త ప్రభుత్వ భవనమే నిర్మాణం

బాబు పాలనలో ఇలా..



ఈ ఫొటోలో కనిపిస్తున్నది నరసాపురంలో నిర్మాణం పూర్తయిన అన్న క్యాంటీన్. గత ప్రభుత్వంలో దీనిని సీఐ కార్యాలయంగా వినియోగించారు. తాజాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో అన్న క్యాంటీన్ కోసం మరమ్మతులు చేపట్టారు. రూ.16 లక్షలతో టైల్స్, పెయింటింగ్, గ్లాసులు, నేమ్ బోర్డు తదితర పనులు చేశారు. గత ప్రభుత్వంలో ఓ ఆర్‌బీకే భవనం నిర్మాణానికి రూ.21 లక్షలు ఖర్చయితే తాజాగా ఉన్న భవనానికి మరమ్మతులకు కూటమి ప్రభుత్వం వెచ్చించిన మొత్తం రూ.16 లక్షలు.

జగన్ పాలనలో ఇలా..



ఈ ఫొటోలో కనిపిస్తున్నది నరసాపురం మండలం సీతారాంపురం సౌత్ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం. కొత్తగా నిర్మించిన భవనమిది. 1,121 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక వరండా, సిబ్బంది కోసం రెండు గదులు, రైతులతో సమావేశాల నిర్వహణ కోసం విశాలమైన హాలు, రైతుల కోసం కియోస్క్, లైబ్రరీ ర్యాక్స్, రైతులకు అందించే సేవలు తెలిపే డిస్‌ప్లేలు, ఫర్నిచర్ తదితర అన్ని హంగులతో గత జగన్ ప్రభుత్వంలో భవన నిర్మాణానికి అయిన ఖర్చు రూ.21 లక్షలు.

సాక్షి, భీమవరం: రాష్ట్రవ్యాప్తంగా అన్న కాంటీన్లను పునః ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తొలి విడతగా జిల్లాలో ఎనిమిది చోట్ల క్యాంటీన్లను ప్రారంభించేందుకు ఎంపిక చేశారు. వాటిలో భీమవరంలోని పాత బస్టాండు, ఆర్టీసీ బస్టాండు, ఆర్అండ్‌బీ కార్యాలయం పక్కన, పాలకొల్లులో బస్టాండు పక్కన, తాడేపల్లిగూడెంలోని బీఆర్ మార్కెట్, తహసీల్దార్ కార్యాలయం, ఆటో స్టాండ్ సెంటర్, తణుకులో మీ సేవా కేంద్రం ఎదురుగా అన్న క్యాంటీన్లు ఉన్నాయి. అలాగే తొలి విడతలో నరసాపురంలోని అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు మరమ్మతులు పూర్తిచేశారు. అయితే ఫుడ్ కాంట్రాక్టు ఖరారు కాకపోవడంతో ప్రస్తుతానికి ఈ క్యాంటీన్ ప్రారంభం వాయిదా పడినట్టు అధికారులు తెలిపారు.

అంచనాల్లో చేతివాటం

అన్న క్యాంటీన్లు నిర్వహించనున్న భవనాలన్నీ గతంలో నిర్మించినవే. వీటికి కొత్తగా రంగులద్దే కార్యక్రమంలో లక్షలు కాజేసేందుకు స్కెచ్ వేశారు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే చాలు అన్న వాటికి కూడా అంచనాలు పెంచేసి కొందరు అధికారులు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. భీమవరంలోని బస్టాండు వద్ద గల క్యాంటీన్ మరమ్మతులకు రూ.10 లక్షలు, మిగిలిన రెండింటికీ రూ.7.9 లక్షల చొప్పున అంచనాలు రూపొందించారు. తణుకులోని క్యాంటీన్‌కు రూ.11 లక్షలు, పాలకొల్లులో రూ.7 లక్షలు, తాడేపల్లిగూడెంలో ఒక క్యాంటీన్‌కు రూ.8 లక్షలు కాగా మిగిలిన రెండింటికీ రూ.7 లక్షలు, రూ.5 లక్షలు అంచనాలు రూపొందించారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది వీరవాసరం మండలం రాయకుదురు గ్రామ సచివాలయ భవనం. ఉద్యోగుల కోసం కింద రెండు గదులు, ఒక హాల్, శానిటేషన్ సామగ్రి భద్రపరిచేందుకు స్టోర్ రూమ్, మొదటి అంతస్తులో రెండు గదులు, విశాలమైన హాల్, టాయిలెట్స్ తదితర సదుపాయాలతో భవన నిర్మాణానికి అయిన వ్యయం రూ.40 లక్షలు. ఈ మొత్తంలో కింద ఫ్లోర్‌కు రూ.25 లక్షలు కాగా మొదటి అంతస్తు నిర్మాణానికి అయిన వ్యయం రూ.15 లక్షలు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది భీమవరంలోని బస్టాండు వద్ద గల అన్న క్యాంటీన్ భవనం. భవనం అంతా బాగానే ఉంది. కొత్తగా రంగులు వేసి, ఫ్లోరింగ్, మైనర్ మరమ్మతులు చేసినందుకు ప్రభుత్వం వెచ్చించిన మొత్తం రూ.10 లక్షలు. అలాగే తణుకులో అన్న క్యాంటీన్ భవనానికి రంగులు వేసేందుకు, ఇంటీరియర్ మరమ్మతుల నిమిత్తం రూ.11 లక్షలు ఖర్చు చేశారట. తాడేపల్లిగూడెంలో ఓ అన్న క్యాంటీన్ భవనం మరమ్మతుల కోసం కూడా కూటమి ప్రభుత్వం రూ.8 లక్షలు ఖర్చు చేసింది.

మరమత్మలకు సంబంధించి కూటమి నాయకులకు కాంట్రాక్టులు ఇవ్వడం ద్వారా వారి జేబులు నింపే బాధ్యతను అధికారులు తీసుకున్నారు.

అడ్డగోలుగా పెంచేశారు

ఒక భవనం నిర్మిస్తే ఎంత వ్యయం అవుతుందో అందుకు సమానంగా మరమత్మలకు వ్యయ ప్రణాళికలు రూపొందించడం విస్మయపరుస్తోంది. గత ప్రభుత్వంలో సచివాలయం, అన్ని వసతులతో విశాలమైన ఆర్‌బీకే భవనం నిర్మాణానికి అయిన వ్యయం రూ.21 లక్షలు. సచివాలయం భవనం గ్రౌండ్ ఫ్లోర్‌కు అయితే రూ.15 లక్షల వరకు ఖర్చయ్యింది. ప్రస్తుతం అన్న క్యాంటీన్లలో ఫ్లోరింగ్, పెయింటింగ్, నేమ్ బోర్డులు, ఇతర మరమత్మల కోసం అధికారులు రూపొందించిన అంచనాలకు మరో రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు వెచ్చిస్తే ఏకంగా కొత్త భవనాలనే నిర్మించవచ్చు. ప్రస్తుతం జిల్లాలోని క్యాంటీన్ల కోసం రూ.80 లక్షలు వ్యయం కాగా చాలా వరకు సొమ్ములు అధికారులు, కూటమి నేతల జేబుల్లోకి వెళ్లిపోయాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● నమ్మండి.. ఇది కాలువేనండి



ఈ చిత్రంలో కనిపిస్తున్నది నరసాపురం మీదుగా చినమామిడిపల్లి-సరిపల్లి వెళ్లే పంట కాలువ. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకు దాదాపు 40 గ్రామాల్లోని సుమారు 5 వేల ఎకరాల భూములకు సాగునీటి సరఫరాకు ఇదే ఆధారం. ఆయా గ్రామాల తాగునీటి అవసరాలకూ ఈ కాలువే దిక్కు. అయినా ఈ ఏడాది వేసవిలో కాలువలో తూడును తొలగించలేదు. కనీసం సాగునీరు విడుదల చేసినప్పుడు కూడా పట్టించుకోలేదు. దీంతో ఇలా చెత్తతో పూడుకుపోయి.. తన రూపాన్నే కోల్పోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారేమో చూడాలి మరి. -నరసాపురం

పట్టణాల్లో భూ సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): వచ్చే నెలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులు పట్టణాల్లో కూడా నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర రహదారులపై టోల్ చార్జీల ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశాన్ని తెల్లం రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీతారాం మాట్లాడుతూ ఇప్పటికే సీపీఎం ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల భూపోరాటాలు చేశామని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన భూములు అన్యాక్రాంతమయ్యారన్నారు. రోడ్లను అభివృద్ధి చేయడం, వాటిని నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.

నేడు వైద్య సేవలు బంద్

ఏలూరు టౌన్: కోల్‌కతాలో పీజీ ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా దేశవ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు 24 గంటల పాటు వైద్య సేవలను నిలిపివేస్తున్నామనీ, వైద్యులపై దారుణకాండలకు వ్యతిరేకంగా డాక్టర్లు ఆందోళన బాటపట్టారని హాస్పిటల్ బోర్డు ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.శ్రీనివాసరాజు తెలిపారు. ఏలూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు వైద్యసేవలు నిలిపివేసేందుకు ఐఎంఏ నిర్ణయించిందన్నారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని కేవలం అత్యవసర సేవలను మాత్రమే కొనసాగిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా వైద్యులు బంద్‌లో భాగస్వాములవుతారని చెప్పారు. తొలిదశలో 24 గంటల పాటు వైద్య సేవలు బంద్ చేస్తున్నామనీ, ప్రభుత్వాలు స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

మహిళా వైద్యులకు భద్రత కరువు
ఏలూరులో గళమెత్తిన డాక్టర్లు.. కొవ్వొత్తులతో భారీ ర్యాలీ



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

ఏలూరు టౌన్: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల బోధనాస్పత్రిలో పీజీ ట్రైనీ మహిళా వైద్యురాలిపై కొందరు సామూహిక హత్యాచారానికి పాల్పడిన సంఘటనపై ఏలూరు జీజీహెచ్‌లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఆందోళన చేపట్టారు. వైద్యులు, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు లక్ష్మణమూర్తి నాయకత్వంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పెద్దసంఖ్యలో హాజరై నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య మాట్లాడుతూ వైద్యురాలిపై దారుణకాండను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. డాక్టర్ చందన మాట్లాడుతూ పోలీస్ అవుట్‌పోస్టులు సైతం నామమాత్రంగా పనిచేయటం కాకుండా, మహిళా పోలీసులు ఉంటూ వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో రాత్రి భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. జీజీహెచ్ నుంచి కోర్టు సెంటర్ మీదుగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

క్లుప్తంగా

సారా తయారీ కేంద్రంపై దాడి


స్వాధీనం చేసుకున్న సామగ్రితో సిబ్బంది

చాట్రాయి : నాటుసారా తయారీ కేంద్రంపై దాడి చేసినట్లు నూజివీడు సీఐ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఆరుగొలనుపేట శివారు అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 15 లీటర్ల నాటుసారా, 5 వేల లీటర్ల బెల్లం ఊట, 18 అల్యూమినియం పాత్రలు, 30 ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తణుకు: మండలంలోని తేతలి వై-జంక్షన్ వద్ద ఈ నెల 14 రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడని తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. పెంటపాడు మండలం బి.కొండేపాడు గ్రామానికి చెందిన కాకి సత్య సూర్యచంద్రరరావు (45) తణుకులో ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మోటారుసైకిల్‌పై స్వగ్రామం వెళుతుండగా తేతలి వై-జంక్షన్ వద్ద వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూర్యచంద్రరావును చికిత్స నిమిత్తం తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే సూర్యచంద్రరావు చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతుడి భార్య కాకి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మూర్తి వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: అతిగా మద్యం సేవించి కిందపడిపోవడంతో తలకు గాయమై వ్యక్తి చనిపోయినట్లు భీమవరం వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామానికి చెందిన మర్రి భద్రయ్య చేపలు, ఎలుకల పట్టుకుని జీవిస్తుంటాడు. నెల రోజులుగా ఇంటికి వెళ్లకుండా భీమవరం పరిసరాల్లోనే ఉంటున్నాడు. అయితే ఈనెల 12వ తేదిన అతిగా మద్యం సేవించి భీమవరం పట్టణంలోని దిరుసుమర్రులో పడిపోవడంతో తలకు బలమైనగాయమైంది. స్థానికులు గుర్తించి అంబులెన్స్‌లో భీమవరం ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్సకోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1 నుంచి ఐఆర్‌సీటీసీ పుణ్యక్షేత్ర యాత్ర

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు పుణ్యక్షేత్ర యాత్ర పేరుతో పూరీ-కాశీ-అయోధ్య యాత్రను నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ యాత్రలో భాగంగా పూరీ, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్ రాజ్ పుణ్య క్షేత్రాలను సందర్శించవచ్చని తెలిపారు. వచ్చే నెల 1న సికింద్రాబాద్‌లో యాత్ర రైలు బయలుదేరి విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని స్టేషన్లలో ఆగుతుందని పేర్కొన్నారు. .స్లీపర్ క్లాస్ టిక్కెట్ ధర రూ.16,820, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర రూ.26,680, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర రూ.34,950గా నిర్ణయించారని వివరించారు. ఇతర వివరాలకు 92814 95848, 92810 30714కు ఫోన్ చేయాలని సూచించారు.

ఏపీ నిట్ అన్నింటా ఫిట్

- ప్లేస్‌మెంట్స్‌లో దేశంలోని నిట్‌లతో పోటీ
- మేటి సంస్థలతో ఎంఓయూలు
- రెండో దశ పనుల కోసం రూ.428 కోట్లు మంజూరు
- నేడు ఏపీ నిట్ ఆరో స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెం: కేంద్ర విశ్వవిద్యాలయం అనే పేరు వినడమే కానీ ఈ ప్రాంతానికి వస్తుందని ఇక్కడి ప్రజలు ఎప్పుడూ ఊహించలేదు. కేవలం వాణిజ్య కేంద్రంగా ఉన్న తాడేపల్లిగూడెం పట్టణంలో ఆంధ్రప్రదేశ్ విభజనానంతర పరిస్థితుల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంలో తొమ్మిదేళ్ల క్రితం అంటే 2015 ఆగస్టు 20న నిట్ ఏర్పాటు చేశారు. వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో అద్దె భవనంలో ప్రారంభమైన ఏపీ నిట్ ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేసుకుని, సొంత భవనాలను నిర్మించుకుని తరగతులు నిర్వహించుకునే స్థాయికి వచ్చింది. దశల వారీగా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అధునాతన భవనాలు, ఆహ్లాదకర వాతావరణం నిట్‌లో సమకూరుస్తున్నారు. ప్రస్తుతం ఏపీ నిట్ అంచెలంచెలుగా ఎదుగుతూ దేశంలోని 31 నిట్‌లకు గట్టి పోటీనిస్తోంది. బాలారిష్టాలను అధిగమిస్తూ శరవేగంగా ముందుకెళుతున్న ఏపీ నిట్ ఆరో స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు.


ఏపీ నిట్ ముఖద్వార సముదాయం


ల్యాబ్ కాంప్లెక్స్

1946 మందికి ఉద్యోగాలు

విద్యార్థులు కూడా కాలేజీల ఎంపికలో ఏపీ నిట్‌కు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇక్కడ చేరడమే కాదు భారీ వేతనాలతో ఉద్యోగాలు పొందుతున్నారు. ఇప్పటి వరకు ఏపీ నిట్ నుంచి విద్య పూర్తి చేసుకుని 2650 మంది విద్యార్థులు బయటకు వెళ్లారు. వీరిలో 1946 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. అత్యధిక సాలుసరి వేతనం రూ.44.1 లక్షలుగా ఉంది.

వేగంగా అభివృద్ధి పనులు

నిట్ ఏర్పాటైన తర్వాత వన్-ఎ పనుల కింద అవసరమైన భవనాలను గతంలో రూ.206 కోట్లతో నిర్మించారు. వన్-బి పనుల కింద రూ.210 కోట్ల అంచనాతో ప్రారంభించిన పనులు, భవనాలు పూర్తయ్యాయి. ఈ విద్యాసంవత్సరంలో రూ.428 కోట్ల నిధులతో రెండో దశ పనులను చేయనున్నారు.

గేట్‌లో మేటి

గేట్ ర్యాంకులు సాధించడంలో ఏపీ నిట్ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. ఆలిండియా గేట్ మొదటి ర్యాంకును ఏపీ నిట్ విద్యార్థి సాధించడం విశేషం. ఏటా వంద మంది నిట్ విద్యార్థులకు గేట్ ర్యాంకులు వస్తున్నాయి.

భారీ ప్రాజెక్టులు

నిట్‌లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ సభ్యులు దేశంలో వివిధ అంశాలకు సంబంధించి మంచి ప్రాజెక్టులను చేజిక్కించుకున్నారు. స్పాన్సర్డ్ ప్రాజెక్టుల కింద రూ.15 కోట్ల విలువైన ప్రాజెక్టులను దక్కించుకున్నారు.

బడా కంపెనీలతో ఎంఓయూలు

దేశంలో, ప్రపంచంలో పేరున్న సంస్థలతో ఏపీ నిట్ ఎంఓయూలు కుదుర్చుకుంది. ఐఐఎం, ఐఐటీ, ఎన్‌హెచ్ఏఐ, లింక్డ్ ఇన్, తైవాన్ యూనివర్సిటీలతో సుమారు 21కి పైగా ఎంఓయూలు కుదుర్చుకుంది.

స్టడీ ఇన్ ఇండియా

స్టడీ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, ఉగాండా, ఇథియోపియా వంటి దేశాల విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. 2020-21 సంవత్సరంలో దక్షిణ భారతదేశంలో ఉత్తమ విద్యాసంస్థగా అవార్డు వచ్చింది. నిర్మాణాల విషయంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ అవార్డును దక్కించుకుంది. సొంతంగా 30 వేల యూనిట్ల సౌర విద్యుత్‌ను తయారు చేసుకునే స్థాయికి చేరింది. రూ.428 కోట్ల నిధులు వస్తే విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు.


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ భవనం


నిట్ ఆడిటోరియం రవీంద్ర కళాభారతి

వసతుల కల్పనకు కృషి

ఏపీ నిట్ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించే ప్రయత్నాలు చేస్తున్నాం. ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా విద్యార్థులకు మంచి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తున్నాం.

– దినేష్ శంకరరెడ్డి, రిజిస్ట్రార్

దంపతుల ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిగూడెం రూరల్: భార్యాభర్తల మధ్య మనస్పర్థలు కారణంగా భార్య కాలువలోకి దూకడంతో వెంటనే భర్త కూడా దూకిన సంఘటన శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండలంలోని చినతాడేపల్లి గ్రామానికి చెందిన కల్లి దుర్గాప్రసాద్, మరియమ్మ దంపతులు ఆసుపత్రి పనిపై తాడేపల్లిగూడెం ఆటోలో వచ్చారు. తిరుగు ప్రయాణంలో భర్త వైజాగ్ క్యాంపునకు వెళ్తానని చెప్పడంతో వెళ్లవద్దని భార్య వారించింది. దీంతో ఆమెపై దుర్గాప్రసాద్ చేయి చేసుకున్నాడు. మనస్థాపం చెందిన మరియమ్మ వెంటనే ఏలూరు కాలువలో దూకింది. ఆమెను కాపాడేందుకు భర్త దుర్గాప్రసాద్ సైతం కాలువలో దూకాడు. ఈ దృశ్యాన్ని చూసిన మారంపల్లి గ్రామానికి చెందిన మిరియాల విజయ్‌కుమార్, రామిశెట్టి అప్పారావు, తోట నాగరాజుతో పాటు వీఆర్వో తలారి రవీంద్రబాబులు వారిని కాపాడారు. అనంతరం దంపతులను పట్టణ పోలీసులు వారిని రూరల్ స్టేషన్‌లో అప్పగించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారి వ్యక్తిగత సంతకాల తీసుకుని ఇంటికి పంపించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన వీఆర్వో తలారి రవీంద్రబాబును తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, డీటీ ఎస్.శివశంకర్ అభినందించారు.


కాలువలో దూకిన వ్యక్తిని గట్టుకు చేరుస్తున్న దృశ్యం

ప్రాణం తీసిన తాత్కాలిక ఆవేశం

నిడమర్రు: తాత్కాలిక ఆవేశంతో భార్య భర్తపై దాడి చేయగా.. అతని ప్రాణమే పోయింన ఘటన పెద నింద్రకొలను గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అత్తిలి గ్రామానికి చెందిన ఏనుగుపల్లి శ్రీను (37)కు, పెదనింద్రకొలను గ్రామానికి చెందిన ఝాన్సీతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి పెళ్లయిన కుమార్తె ఉంది. శ్రీను రోజువారీ కూలీ. వీరికి పెదనింద్రకొలనులోని ఫేజ్-2 వైఎస్సార్ కాలనీలో స్థలం ఉండటంతో గత కొంతకాలంగా ఇక్కడే రేకుల షెడ్ వేసుకుని నివాసం ఉంటున్నారు. భర్త శ్రీను మద్యం మత్తులో తరచూ భార్య ఝాన్సీతో గొడవపడుతూ ఉండేవాడు. రోజూలాగే శుక్రవారం కూడా మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. అదే క్రమంలో గునపం తీసుకుని తాము నివాసం ఉంటున్న రేకుల షెడ్డును పడగొట్టేందుకు యత్నించాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఝాన్సీ.. భర్తను అడ్డుకునేందుకు యత్నించి అతని చేతిలోని గునపాన్ని లాక్కుంది. అయినా అతను తిరిగి గునపాన్ని లాక్కునే ప్రయత్నం చేయడంతో తీవ్ర ఆవేశానికి గురైన ఆమె.. అదే గునపంతో అతని తలపై కొట్టింది. దీంతో శ్రీను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తాను చంపాలని అనుకోలేదని, షెడ్డు కూల్చేస్తున్నాడనే కోపంతో కొడితే ప్రాణమే పోయిందని వాపోయింది. సమాచారం అందుకున్న నిడమర్రు సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్ ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


సంఘటనా స్థలంలో శ్రీను మృతదేహం

నేడు కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

భీమవరం: పట్టణంలోని చిన అమిరం జేపీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయాన్ని శనివారం ప్రారంభిస్తున్నట్లు ఏజీఎం తోట రవిచంద్ర, భీమవరం బ్రాంచ్ ఇన్‌చార్జి జగదీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11:15 గంటలకు కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కలిదిండి సత్యనారాయణరాజు ముఖ్య అతిథిగా హాజరై రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సత్యనారాయణరాజు స్వస్థలం ఆకివీడు కాగా భీమవరం కేంద్రంగా ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ఇక్కడ రీజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. విజయవాడ సర్కిల్ హెడ్, జీఎం రవివర్మ కూడా హాజరయ్యే ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు పాల్గొనాలని కోరారు.

బాలిక అదృశ్యం ఘటన పోక్సో కేసుగా మార్పు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యం కేసును పోక్సో కేసుగా మార్చినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ తెలిపారు. వివరాల ప్రకారం వేగవరం గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రులు మనస్పర్థల కారణంగా విడిగా ఉంటున్నారు. బాలిక తల్లితో కలిసి కాళ్లకూరులోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. అయితే అమ్మమ్మ ఇంటికి పనికి వచ్చే ఒక మహిళ కుమారుడు ముళ్లపర్తి రాజేష్‌తో బాలికకు పరిచయమైంది. ప్రేమిస్తున్నానని వెంటపడుతుండడంతో గమనించిన బాలిక అమ్మమ తరపు వారు జంగారెడ్డిగూడెంలోని బాలిక చిన్నాన్న ఇంటికి పంపిచారు. జూలై 7న బాలికకు ఫోన్ చేసిన రాజేష్ తాడేపల్లిగూడెం రమ్మని చెప్పడంతో బాలిక ఇంటి నుంచి తాడేపల్లిగూడెం వెళ్లింది. ఈ విషయాన్ని గమనించిన బాలిక తరపు వాళ్లు జూలై 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా రాజేష్‌పై అనుమానం ఉందని పేర్కొనడంతో అతని సెల్ సిగ్నల్స్ ఆధారంగా లంబసింగిలో ఉన్నారని గుర్తించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.అయితే మొదట బాలికను అనంతపురం తీసుకెళ్లిన రాజేష్ అక్కడ 12 రోజులు ఉంచి అనంతరం లంబసింగి తీసుకెళ్లాడు. రాజేష్ జూలై 23న అక్కడ ఓ రూమ్ తాళిబొట్టు కట్టి, మనకు పెళ్లయ్యిందని చెప్పి బాలికపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ నేపథ్యంలో మైనర్ బాలిక అదృశ్యం కేసును పోక్సో కేసుగా మార్చామని పోలీసులు తెలిపారు.

మట్టి తవ్వకాలపై కేసు

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి శివారులో పోలవరం కుడి కాలువ గట్టుపై అక్రమ మట్టి తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. గురువారం అర్ధరాత్రి పోలవరం కుడి కాలువ అసిస్టెంట్ ఇంజినీర్ సీహెచ్ బాలాజీ ఒక జేసీబీని, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేసీబీ ఆపరేటర్, ముగ్గురు ట్రాక్టర్ డ్రైవర్లపై ఎస్సై జి.సతీష్ కేసు నమోదు చేశారు.

తమ్మిలేరు మరమ్మతులు మరింత ఆలస్యం

- అధిక వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు
- 347.52 అడుగులకు చేరిన నీటిమట్టం

చింతలపూడి : ఏలూరు జిల్లాలో మధ్యతరహా సాగు నీటి ప్రాజెక్టుల్లో ఒకటైన తమ్మిలేరు జలాశయం మరమ్మతులు ఆలస్యమవుతాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఇటీవల అల్ప పీడన ప్రభావంతో నెల రోజుల పాటు భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ప్రాజెక్టు ఆధునికీకరణ నిమిత్తం జపాన్ ఆర్థిక బ్యాంక్ నుంచి 2018లో 16.91 కోట్ల రుణం మంజూరైంది. 2023లో ప్రాజెక్టు కింద పంటకాలువల మరమ్మతుల కోసం 13 కోట్లకు టెండర్లు ఖారారు చేసి అదే ఏడాది ఫిబ్రవరిలో ఎడమ కాలువ మరమ్మతులను అధికారులు ప్రారంభించారు. ప్రాజెక్టు మరమ్మతులు పూర్తయితే జలాశయం నుంచి సాగు నీటి సరఫరాకు అడ్డంకులు తొలగిపోతాయి.

మరమ్మతులు ఇలా

ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువలతో పాటు మంకొల్లు కాలువలకు సంబంధించి 70 కిలో మీటర్ల మేర 765 పనులను అధికారులు గుర్తించారు. వాటిలో అవసరమైన పనులను తొలుత ప్రారంభించారు. పంట కాలువల్లో పూడిక తీతతో పాటు స్లూయిజ్‌ల మరమ్మతులు, కాలువల గేట్లు అవసరమైతే పునర్నిర్మాణం కూడా చేపడుతున్నారు. వీటితో పాటు జలాశయం ప్రధాన కట్టను కూడా రూ.కోటితో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ ఎస్ఈ చెబుతున్నారు. ప్రాజెక్టు ప్రాంతంలో ఇన్‌స్పెక్షన్ రూమ్, జనరేటర్ రూమ్ నిర్మాణాలు కూడా చేపట్టనున్నారు. గతేడాది తొలకరి నాటికి పంట కాలువల పనులు పూర్తి చేయాలని భావించినా తొలకరిలో కురిసిన వర్షాల వల్ల పనులు నిలిచిపోయాయి. ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గాక పనులు ప్రారంభించాలని అనుకుంటున్న తరుణంలో గతేడాది డిసెంబర్ నెలలో ఏర్పడిన తుఫాన్ వల్ల పనులు ముందుకు కదల్లేదు. ఈ నేపథ్యం ఈ ఏడాది వేసవిలో కొంత మేర పనులు చేపట్టారు. ఇప్పటిరకు సుమారు రూ.కోటి యాభై లక్షల విలువైన పనులు పూర్తయినట్లు ప్రాజెక్టు నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.


తమ్మిలేరు జలాశయం


ఎడుమ కాలువ ఎర్త్ వర్క్ పనులు పూర్తయిన దశ్యం (ఫైల్)

నీటి మట్టం తగ్గిన వెంటనే మరమ్మతులు



అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు తమ్మిలేరు ప్రాజెక్టులోకి గరిష్ట స్థాయిలో నీరు చేరింది. దీంతో పంట కాలువల మరమ్మతులు చేయడం సాధ్యం కావడం లేదు. జలాశయంలో నీటిమట్టం తగ్గాక జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాలువలను పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– బి.శ్రీనివాసరావు, డీఈ, తమ్మిలేరు ప్రాజెక్టు

తమ్మిలేరు ఆయకట్టు ఇలా

తమ్మిలేరు ప్రాజెక్టు కింద రిజర్వాయర్ ఎగువ భాగంలో 20,230 ఎకరాలు, దిగువ భాగంలో ఏలూరు వెళ్లే ఇరువైపులా 15 కాలువల ద్వారా 14,200 ఎకరాలు సాగవుతున్నాయి. ఏలూరు జిల్లాలోని తల్లార్లపల్లి, యర్రంపల్లి, యడవల్లి, కల్యాణంపాడు, తువ్వచెలక రాయుడుపాలెం గ్రామాల్లోని 475 ఎకరాల పల్లం భూములకు, 3,769 ఎకరాల మెరక భూములకు నీరు అందుతుంది. అలాగే పోలవరం, చాట్రాయి, తుమ్మగూడెం, మంకొల్లు, సోమవరం గ్రామాల్లో 1,855 ఎకరాల పల్లం భూములకు, 3,070 ఎకరాల మెరక భూములకు సాగునీరు లభిస్తుంది.

మన్యంలో జలహొయలు

ఏజెన్సీ పచ్చదనం అందరినీ ఆకర్షిస్తోంది. వరుసగా వర్షాలు పడడం వల్ల వనం మొత్తం పచ్చ దుప్పటి కప్పుకున్నట్టుగా ఉంది. ముఖ్యంగా జలపాతాలు ఆకర్షిస్తున్నాయి. ముంజులూరు, గడ్డపల్లి, దారావాడ, చిలకలూరు, గుబ్బల మంగమ్మతల్లి గుడి సమీపంలోని అటవీ ప్రాంతాల్లోని ప్రకృతి సోయగం పర్యావరణ ప్రేమికులను మంత్ర ముగ్దుల్ని చేస్తోంది. ముఖ్యంగా గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే రహదారి, ముంజులూరు నుంచి గోగుమిల్లి వెళ్లే రహదారిపై పయనిస్తుంటే ఇరువైపుల నుంచి పచ్చదనంతో ఎత్తయిన చెట్లతో సహజసిద్ధమైన ప్రకృతి స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తోంది. ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం ప్రస్తుతం పర్యాటకులతో సందడిగా మారింది. అలాగే గుబ్బల మంగమ్మ గుడిపై నుంచి వచ్చే జలపాతం కూడా ప్రవహిస్తూ అమ్మవారి దర్శనానికి వెళ్లిన భక్తులను కనువిందు చేస్తోంది.

– బుట్టాయగూడెం


ముంజులూరు సమీపంలోని ఏనుగుతోగు జలపాతం


వర్షాలకు పచ్చగా ఉన్న ముంజులూరు అటవీప్రాంతం


అలివేరు సమీపంలో కొండలను తాకుతున్న మేఘాలు


గుబ్బల మంగమ్మతల్లి గుడి పైనుంచి ప్రవహిస్తున్న జలపాతం

క్లుప్తంగా

తణుకులో నేడు, రేపు వైద్యసేవలు నిలిపివేత

తణుకు: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్య ఘటన నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తణుకు శాఖ ఆధ్వర్యంలో తణుకు పట్టణంలోని 17, 18 తేదీల్లో వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ తణుకు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కుదారి ఆనంద్, డాక్టర్ ఎంవీ సుబ్బరాజులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్తమ పీహెచ్‌సీగా పెంటపాడు

పెంటపాడు: పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉత్తమ పీహెచ్‌సీగా ఎంపికైంది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రత్యేక అవార్డు దక్కింది. ఆసుపత్రి రికార్డులు, కాన్పులు, గ్రేడ్‌లతో ఉత్తమ పనితీరు కనపరచడం వల్ల ఈ అవార్డు దక్కినట్లు వైద్యాధికారులు తోట రాజేష్‌కుమార్, వి. మౌనికలు పేర్కొన్నారు. ఈ అవార్డును గురువారం డాక్టర్ మౌనిక కలెక్టర్ చేతుల మీదుగా అందుకొన్నారు. ఇటీవల ఆసుపత్రిని ప్రత్యేక సిబ్బంది తనిఖీ చేశారు ఈ అవార్డు దక్కడం పట్ల గ్రామ ప్రముఖుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి, ఎంపీపీ దాసరి హైమావతి తదితరులు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఇరగవరం ఎంపీడీవోగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

ఇరగవరం: మండల ఎంపీడీవోగా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సాధా రణ ఎన్నికల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం బదిలీపై వెళ్లడం జరిగింది. అక్కడ నుంచి మళ్లీ ఇరగవరం మండలం బదిలీ పై రావడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఇరగవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలోని ఇరగవరం గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద పాలకొల్లు ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాజు ఆధ్వర్యంలో ఉచిత హోమియో పిల్స్ కార్యక్రమం నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి అందరికి వైద్య పరీక్షలు నిర్వహించే చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు దీర్ఘకాలికా వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఇప్పటి వరకు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు మూడు సైకిళ్ల అందజేత



పేద విద్యార్థినులకు మూడు సైకిళ్లను అందజేస్తున్న ట్రస్టీ చెన్నా జనార్ధనరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దాతలు రాజా గాయత్రీ, అవినాష్ దంపతులు సహాయ సహకారాలతో శుక్రవారం పెంటపాడుకు చెందిన ముగ్గురు విద్యార్థినులకు చదువుల నిమిత్తం మూడు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ట్రస్టీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నా జనార్ధనరావు, రెబల్ సపోర్టు ఆర్గనైజేషన్ వలంటీర్లు ఆనందరావు, అపర్ణ భార్గవి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన జరిగింది. వరలక్ష్మి వ్రతం కావడంతో ఇంటి వద్ద పూజలు అనంతరం ఆలయానికి చేరుకుని భక్తులు అమ్మవారిని విశేషంగా దర్శించుకున్నారు.

దాడి కేసు నమోదు

భీమవరం: దాడి చేసి, కొట్టి గాయపరిచారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం టుటౌన్ ఎస్సై రెహమాన్ శుక్రవారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. భీమవరం మండలం చినఅమిరం గ్రామానికి చెందిన మన్నె ఆనంద్‌కుమార్ ఈ నెల 15 రాత్రి భీమవరం నుంచి చినఅమిరం మోటారు సైకిల్‌పై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన ఉదయకుమార్ అతనిపై దాడి చేసి కొట్టాడు. దీంతో గాయపడిన ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యులు చికిత్స కోసం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రెహమాన్ తెలిపారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



పరిమెళ్ల- కె. పెంటపాడు మధ్య మధ్యాహ్నం సమయంలో జనసంచారం లేక ఖాళీగా ఉన్న రహదారి



పెంటపాడులో ఎండ వేడిమితో ఇళ్లలో నుంచి బయటకు రాక కర్ఫ్యూను తలపిస్తూ జనసంచారం లేని ఓ చిన్న వీధి

- ఎండకు తాళలేక ఆపసోపాలు
- సరిగా పనిచేయని ఏసీలు
- వేడిగాలి వీస్తున్న ఫ్యాన్‌లు
- జనం అవస్థలు

పెంటపాడు: వర్షాకాలంలో ఉక్కపోతతో ప్రజలు ప్రజలు విలవిలాడుతున్నారు. ఎన్నడూ లేని రీతిలో ఈ సారి వాతావరణం అనూహ్యంగా మారింది. అడపాదడపా ఒక్కోసారి వాతావరణం చల్లబడి వర్షం పడినా, తిరిగి యథాతథంగా సూర్యుడు మండిపడుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో జనం అల్లాడి పోతున్నారు. రోహిణి కార్తెను మించి గత నాలుగురోజులుగా ఎండలు దంచి కొడుతున్నాయి. దీనికి తోడు ఉక్కపోత, మే నెలాలో వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులతో పాటు, ప్రతి ఒక్కరూ ఆపసోపాలు పడుతున్నారు. విపరీతమైన ఉక్కపోత, ఎండలు కారణంగా ఉదయం 10 గంటల తర్వాత జనం భయటకు రావడానికి భయపడుతున్నారు. అత్యవసర ప్రయాణాలు వాయిదా వేసుకొంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా అన్ని మండలాలలోనూ 45 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. మొత్తం మీద మంగళవారం భానుడు మరింతగా మండిపడిపోయాడు. బుధవారం మరింత ఉండే అవకాశం ఉంది. మిట్ట మధ్యాహ్నం ప్రతి ఒక్కరూ వద్ద వాటర్ బాటిల్ కనిపించిందంటే ఎండ తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో ఊహించవచ్చు. సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు బద్దలయ్యేలా ఎండలు ఉంటాయని నానుడి. అంతకంటే ఎక్కువగా దివి నుంచి భువికి అగ్నివర్షం కురిసినట్టుగా అధిక ఎండ, ఉక్కబోత ఉండటంతో ప్రజలు విస్తుపోతున్నారు. రాత్రి అయినా వేడి తగ్గడంలేదు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. వేడి తాపంతో కూడిన జ్వరాలు వస్తున్నాయి. పలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో రోగులు అధికంగా జ్వరాలు, టైఫాయిడ్ బారిన పడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోడ్లు కరోనా నాటి కర్ఫ్యూను తలపిస్తున్నాయి. మరో వైపు వైద్యులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అవసరమైతేనే తప్ప ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు. మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వాడుకోవాలన్నారు. వడదెబ్బ సోకుండా వదులు దుస్తులు, లైట్ కలర్ దుస్తులు వాడాలన్నారు.

ఉక్కపోతతో అల్లాడిపోతున్నాం



వర్షాకాలంలో ఎన్నడూ చూడలేని ఈ ఉక్కపోత తో అల్లాడిపోతున్నాం. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. ఇంటి పనులు, వ్యవసాయ పనులు చేసుకొనేందుకు ఎండవల్ల ఇబ్బంది పడుతున్నాం.

– మర్రే కృష్ణమూర్తి, బి.కొండేపాడు

ఆపసోపాలు పడుతున్నాం



గత వేసవికాలం చూసాం . అదే ఎంతో బాగుంది. సాయంత్రం చల్లటి గాలి వీచేది. కానీ నాలుగు రోజులుగా తీవ్ర ఎండలు, ఉక్కపోత ఉంది. ఈ ఎండకు జ్వరాలు కూడా వస్తున్నాయి. వర్షాల వల్ల జ్వరాలు వచ్చి తగ్గినా, మళ్లీ ఈ ఎండల వల్ల వ్యాధులు ఎక్కువ అవుతున్నాయి.

– కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పెంటపాడు

ఎండలో తిరగొద్దు



వాతావరణ మార్పుల వల్ల వస్తున్న ఈ ఎండ ప్రమాదకరం. బయటకు వెళ్లాల్సి వస్తే రక్షణకు సంబంధించి జాగ్ర త్తలు పాటించాలి. వికారం, వాంతులు వస్తే డాక్టర్లను సంప్రదించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. స్పైసీ ఆహారం తగ్గించాలి.

– డాక్టర్ పూజిత, ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న సభ్యులు



తణుకులో నిరసన తెలియజేస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యల నుంచి రక్షణ కల్పించాలని కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పీఎంపీ అసోసియేషన్ హాల్‌లో జరిగిన సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్టు గ్రాడ్యుయేషన్ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ దీనికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యంత్రాంగం దోషులను కాపాడే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల యూనిట్ అధ్యక్షులు మునగాల జితేంద్ర, కార్యదర్శి కొల్లి రాజశేఖర్, గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జేవీ త్రినాథ్, అజీజ్, దుర్గారావు, కెఎల్ నరసింహారావు, గిరిధర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థిని హత్యకు ఐఎంఏ ఖండన

తణుకు: ఇటీవల కోల్‌కతా ఆర్‌జీ కేఏఆర్ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న వైద్య విద్యార్థినీని దారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన ఉదంతంపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తణుకు శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం తణుకు ఐఎంఏ హాల్‌లో సంతాపసభ నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కుదారి ఆనంద్, కార్యదర్శి డాక్టర్ ఎంవీ సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొని కొవ్వొత్తులతో తమన నిరసన తెలిపారు. ఇటీవల వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ (సీపీఏ) ద్వారా వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, తహసీల్దార్ వర్మలకు వినతి పత్రాలు అందజేశారు.

విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

- అప్ అండ్ డౌన్స్‌తో ఇబ్బందులు
- కాలిపోయిన విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు



లోపాలు తలెత్తిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్





విద్యుత్ అంతరాయాల వల్ల కాలిపోయిన విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో స్థానిక 9వ వార్డు, శేషమహల్ సెంటర్ వెనుక భాగంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపాల కారణంగా పలు ప్రాంతాల వాసులకు, అపార్ట్‌మెంట్ వాసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు గురువారం రాత్రి నుంచి ఏర్పడ్డాయి. శుక్రవారం కూడా అంతరాయాలు కొనసాగాయి. ట్యూబులైట్లు, విద్యుత్ బల్బ్‌లు ఆరిపోవడం, వెలగడం (ఫ్లికరింగ్స్) వస్తున్నాయి. ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. ఒకరి ఇంట్లో ఖరీదైన ఆర్వో సిస్టమ్, టీవీ యూనిట్, సౌండ్ బాక్సులు కాలిపోయాయి. మరొకరి ఇంట్లో స్టెబిలైజర్ కాలింది. కేబుల్ బాక్స్‌లు కాలాయి. అప్ అండ్ డౌన్స్‌ను గుర్తించిన చాలా మంది ఆయా ఎలక్ట్రానిక్ పరికరాలకు విద్యుత్ కనెక్షన్లు తీసివేశారు. రిఫ్రిజిరేటర్లలో లోపాలు ఏర్పడ్డాయని, ఏసీల్లో అంతరాయాలు వచ్చాయని, ఫ్యాన్లు నెమ్మదిగా లేదా వేగంగా తిరుగుతున్నాయని స్థానికులు వాపోయారు. శేషమహల్ వెనుక ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిగా నిర్వహించకపోవడం కారణంగానే, రావిచెట్లు కొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకుతున్నాయని, వర్షకాలం కావడంతో సమస్య మరింత జఠిలంగా మారిందని అంటున్నారు. చాలా కాలంగా అనేక సార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని, గతంలో లిఫ్ట్ సైతం ఒకసారి కాలిపోయిందని చెబుతున్నారు. విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదని, సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



భీమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: అంగన్‌వాడీల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి హెచ్చరించారు. శుక్రవారం ఆచంట మండలం భీమలాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చిన్నారులకు సమయానికి ఆహారం అందించాలన్నారు. సర్పంచ్ గుబ్బల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఉండి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ వి.నిర్మల అన్నారు. శుక్రవారం మండలంలోని ఉణుదుర్రులోని అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి వందరోజుల కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమం, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. వీరందరికీ అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ప్రీ స్కూల్ విద్యను అందిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.రత్న కుమారి, ఏఎన్ఎం వై.సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం, కడియద్ద సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఏఈ అల్లు రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వెంకట్రామన్నగూడెం గ్రామంలో రోడ్డు పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, కడియద్ద సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు వివరించారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): టౌ టౌన్‌లో 11కేవీ మార్కెట్ ఫీడర్, 11 కేవీ పడాల ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను నరకడం, వివిధ రిపేర్‌లు నిమిత్తం ఈ నెల 17వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లముదునూరుపాడు, పడాల, పడాల గురువు, యాగర్లపల్లి ప్రాంతాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ పీ అండ్ టీ కాలనీకి సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 17వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. పీ అండ్ టీ కాలనీ, వివేకానంద బొమ్మ సెంటర్, డీఎస్ చెరువు, మూడవ వాటర్ ట్యాంక్ ఏరియాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకులో...

తణుకు: తణుకు, వేల్పూరు, పైడిపర్రు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని లైన్లు మరమ్మతుల నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తణుకు మున్సిపల్ పరిధిలోని వేల్పూరు రోడ్డు, భాష్యం స్కూల్ నుంచి గ్రాండ్ గోస్తనీ ప్రాంతం, వెంకట్రాయపురం ప్రాంతాలతో పాటు వేల్పూరు, మండపాక, పైడిపర్రు, కావలిపురం, రేలంగి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

తణుకు టౌన్: వృద్ధుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి కోరారు. శుక్రవారం ప్రపంచ వృద్ధుల కోర్కెల దినోత్సవం సందర్భంగా వృద్ధుల సంక్షేమం కోరుతూ తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల ఆస్తి రక్షణ, ప్రాణ రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. వృద్ధులకు వివిధ సంక్షేమ పథకాలలో రాయితీలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎండీ స్వాహలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు నాదెళ్ల కృష్ణానందం, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, పెనుమర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం



తణుకులో కలగర వెంకటకృష్ణను సత్కరిస్తున్న నాయకులు

తణుకు: మాదిగ దండోరా నాయకులు ఎందరో త్యాగాల ఫలమే ఎస్సీ వర్గీకరణ కోర్టు తీర్పు అని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి (ఎమ్మార్పీఎస్ఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగా సంజయ్‌మాదిగ అన్నారు. శుక్రవారం తణుకు ఎన్టీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ ఉద్యమాలకు సహకారం అందజేసిన తణుకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణను సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మల్లిపూడి జగ్జీవన్, జిల్లా అధ్యక్షుడు సిర్రా బ్రహ్మయ్య, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు సొంగా ప్రసాద్, మల్లిపూడి నికోలస్ రాజు, చదలవాడ సతీష్, ఎం.సుభాష్, సిర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు రూ.లక్ష ఆర్థిక సాయం



తణుకులో ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న ముస్లిం మతపెద్దలు

తణుకు: ఇటీవల కేరళ రాష్ట్రం వాయనాడ్‌లో భారీ వర్షాలు కారణంగా నిరాశ్రయులైన బాధితుల సహాయార్థం తణుకులోని హనీఫ్ పేట మసీదు తరపున డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఇతర ముస్లిం మత పెద్దలు రూ. లక్ష చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ మేరకు చెక్కును తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. తణుకు పట్టణానికి చెందిన డాక్టర్ రిమ్మలపూడి సూర్యరాజు దంపతులు రూ. 50 వేలు, డాక్టర్ హుస్సేన్ అహ్మద్ రూ. 25 వేలు సాయాన్ని తణుకులోని అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే రాధాకృష్ణ అభినందించారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెంటపాడు: ఒంటరితనం భరించలేక ఒక వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన ప్రత్తిపాడులో శుక్రవారం చోటు చేసుకొంది. పెంటపాడు ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... గూడెం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన కొయ్యినాడ నూకరాజు(71) భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఆరేళ్ల క్రితం మృతి చెందగా ముగ్గురు కుమార్తెలకు వివాహాలు జరిగి అత్తారింట్లో ఉన్నారు. కొడుకు చాలా కాలం క్రితం ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. దీంతో ఒంటరిగా ఉంటున్న నూకరాజుకు పోషణ లేకపోవడంతో రెండేళ్ల క్రితం పడాలలో ఒక వృద్ధాశ్రమంలో చేరాడు. అయితే 15 రోజుల క్రితం నూకరాజుకు ఆరోగ్యం క్షీణించడంతో చిన్నకుమార్తె ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం తన స్వగ్రామం జగన్నాథపురం వెళ్లి అక్కడున్న బంధువులను పలకరించాడు. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ గురువారం అర్ధరాత్రి ప్రత్తిపాడు బస్సుషెల్టర్‌లో ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. స్థానికుల ద్వారా ఈ విషయాన్ని పెంటపాడు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వచ్చిన బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ గ్యారేజీలో శుక్రవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రెండు సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభించారు. బీఎస్6 బస్సులు అధునాతన టెక్నాలజీతో అతి తక్కువ కార్బన్ ఉద్గారాలతో పర్యావరణ హాని లేని విధంగాను, సుఖవంతమైన ప్రయాణం అందిస్తాయన్నారు.